రాజా

తాత కృష్ణమూర్తిగారు, బి. ఏ., యల్. టి.

కరీమ్ సాయిబుగారి మేడలో బసచేశారు, సర్కస్ మెంబర్లు—ఇంచుమించు పాతికమంది. చుట్టూ పడి పోతూఉన్న కురుచైన ప్రహరీగోడ, విశాలమైన సదును లేని పచ్చిక తిన్నెలు, ఎత్తుగా పెరిగిన చెట్లు, సంరక్షణ లేక కృశిస్తూవున్న పువ్వులమొక్కలు — అన్నీ ఆ యింటి ప్రాకారాని కొకవిధమైన శోభ కూర్చేవి. ఒకప్పుడు జనంతో క్రిక్కిరిసి, కలకల లాడుతూఉండే రమ్యమైన సౌధ మిప్పుడు క్రమంగా పాడువడి బూజుపట్టింది: అందులో కాపురముండేవా ళ్లెవరూ లేక, యేళ్లకొలదీ తలుపులు మూసేవుండేవి. పూనా సర్కస్‌కంపెనీవా ళ్లందులో ప్రవేశించగానే, మళ్లీ కొత్తకళ వచ్చింది మేడకు. ఇంటినిండా కిటకిటలాడుతూ మనుషులు, సామానులు, మెరుపుదీపాలు, అలికిడి, ఉండేసరికి మృతకళేబరానికి ప్రాణం వచ్చిన ట్లయింది, ఆయింటికి.

తమబస కొంఫర్లాంగు దూరంలో ఉండే మైదానం మీద, ఆటకు పెద్దడేరా వేసుకున్నారు సర్కస్‌వాళ్లు. సుమారు పదివేలమందికి సరిపోయినంత డేరా అది. దాని చుట్టూ కొన్ని చిన్నచిన్న డేరాలుకూడా వేసుకున్నారు. గుర్రాలు, ఏనుగులు, కోతులు, కుక్కలు, ఎలుగుగొడ్లు, కంగోరాలు, జీబ్రాలు, పులులు, సింహాలు—ఇంకా యేవేవో జంతువులు,—కొన్ని ఆడేరాలకు దగ్గరగాను, కొన్ని లోపల బోనులలోను, కొన్ని వెలుపలను ఉండేవి. ఈ మృగాలను, డేరాలను, చూడడానికి పురజనులు గుంపులు గుంపులుగా వచ్చి పోతూ ఉండేవారు. ఆ నాలుగు రోజులూ ఊరంతా మహా అలికిడిగా ఉండేది. ఏగోడమీద చూసినా మంచిమంచి రంగుల బొమ్మలతో సర్కస్‌వాళ్ల ప్రకటన పత్రికలే కానవచ్చేవి.

ఆట ప్రారంభించడాని కింకా ఒకరోజు వ్యవధి ఉన్నదనగా కంపెనీవాళ్ల యేర్పాటులన్నీ పూర్తి అయినవి. అది శీతకాలం. డిసెంబరు నెల. వెన్నెల రాత్రులు. చలి మిక్కుటంగా ఉండేది. నాడు దీపాలు పెట్టే వేళప్పుడు సర్కస్ మెంబరు తారాబాయి మేడ దిగివచ్చి, ఆవరణలో ఉన్న బాదంచెట్టుకింద నిల్చుంది, చంద్రుణ్ణి చూస్తూ. పదహారుపదిహేడేళ్ల జవ్వని. చలికి పొడుగైన ఉన్నికోటు తొడుగుకుంది. అందంగా దువ్వుకున్న జుట్టులో గులాబీపువ్వులు పెట్టుకుంది. గాలికి చెదరి కళ్లలోపడుతూవున్న ముంగురులను సవరించుకుంటూ, రోడ్డుదీపాలను, దారిని నడిచే జనులను, మోటారు కార్లను పరీక్షిస్తూ, యేదో ఆలోచిస్తున్న దానివలె పరధ్యానంగా నిల్చుంది. దూరంగా ఎక్కడో గంటలు కొట్టిన చప్పుడు వినవస్తే, చేతినున్న రేడియమ్ రిస్టువాచీ చూసుకుంది ఏడుగంటలయిందప్పుడు. ఇంతట్లో ఎవరో తన భుజంమీద చెయ్యివేసినట్లనిపించి త్రుళ్లిపడి తిరిగిచూసిందామె.

"ఒక్కర్తెవే ఏంచేస్తున్నా విక్కడ—యీ చలిగాలిలో ?" అంటూ చనువుగా చిరునవ్వుతో కుశల ప్రశ్నచేశాడు జమన్సింగ్.

కళ్లెత్తి ఆతడివేపుచూసి, ముసిముసిగా నవ్వి ఊరుకుంది, ఆమె. ఇద్దరూ సర్కస్ మెంబర్లే; ఇద్దరూ పొట్టకోసం కంపెనీలో చేరి నౌఖరీ కున్నవాళ్లే.

తారాబాయి మంచి అందకత్తె. ఆమె నిజమైన కులం యెవరికీ తెలియదు. క్షత్రియకన్య అని చెప్పుకుంటారు. గుర్రపుస్వారి చేస్తుంది. కత్తి తిప్పుతుంది. విలువిద్యలో మంచి ప్రవీణురాలు. తీగమీద నేర్పుగా బైసికిల్ తొక్కుతుంది; నాట్యంచేస్తూ చిత్రంగా మొగ్గలు వేస్తుంది. ప్రేక్షకులను రంజింపజేసే శక్తులు ఎన్నో ఉన్నాయి, ఆమెవద్ద. ముఖ్యంగా ఆమెరూపం, యౌవనం, పురుషుల నాకర్షించి భ్రమింపజేస్తాయి. కేవలం ఆమెనే చూడడానికి సర్కస్‌కు వచ్చేవాళ్లెందరో ఉంటారు. అట్టి మోహనాకార మామెది!

జమన్సింగ్ సుమారు 30 యేళ్లవాడు. మంచి రూపవంతుడు. సర్కస్ విదూషకుడి వేషం వేసి, నవ్వులాటలతోను, వికారచేష్టలతోను, చూపరులను మెప్పిస్తాడు. జంతువైద్యం నేర్చిన డాక్టరు. కనుక అడవి మృగాలను చూసే పూచీకూడా అతనిదే. వాటికి తిండి పెట్టినప్పు డాయన దగ్గిరుంటాడు. ఎప్పుడైనా అవి ఆరోగ్యంగా ఉండనప్పుడు, వాటికి మందులు మాకులు యిస్తాడు.

తారాబాయి అంటే సింగుకు ప్రాణం. ఆమెనెట్లాగైనా వశపరచుకొని, తనదాన్ని చేసుకుందుకు యెన్నో విధాల యత్నించేవాడు. కాని తార బలే పెంకెది. అతని హృదయారాటం తా నర్థం చేసుకోనట్లు నటించేది. జమన్సింగ్ వలె తనకోసం యెంద రెన్ని విధాల తహతహలాడినా ఆమె కానందమే! వాళ్లను పిచ్చివాళ్లను చేసి, ఆడించి తనలో నవ్వుకునేది. పురుష స్నేహితులందరితోను చనువుగానే ప్రవర్తించేది. మగవాడంటే భయం, బిడియం, లేవామెకు. తా నొక స్త్రీ అన్న సంగతి మరచిపోయినట్లు నడుచుకునేది, వాళ్లతో. పురుషులతో స్నేహం, అగ్నితో చెలగాటమన్న సంగతి ఆమె కింకా విశదం కాలేదు!

తారాబాయిని వెన్నెలలో ఒంటరిగా చూసేసరికి, జమన్సింగుకు వొళ్లు పులకరించింది. వెర్రివెర్రి కోర్కలతో హృదయం గెంతులాడింది. పట్టరాని మోహావేశంతో కౌగలించుకొని, చెట్లనీడ నామెను ముద్దుపెట్టుకున్నాడు.

"సింగ్, నీకేం మతిపోయిందా?...వొదులు!" అంటూ సిగ్గుతో పెనగులాడింది, తార.

కాని, ఆనందంతో కులుకుతూ గుండె కామెను మరింత గట్టిగా అదుముకున్నాడు సింగ్. తారకు కోపం వచ్చింది. శక్తికొలదీ పెనగులాడ ప్రారంభించింది. కొప్పులో ఉన్న పువ్వులు నలిగి, క్రింద రాలాయి. ఒళ్లు వేడెక్కి మొహం యెర్రబడింది. తలతిరిగి కళ్లు చీకట్లు కమ్ముకున్నట్లు తోచిందామెకు. బుగ్గలు, పెదవులు, కళ్లు, వక్షం—అన్నీ ముద్దులాడుతున్నాడు సింగు, బలాత్కారంగా. పులిపిల్లవలె రక్కడం ప్రారంభించింది, తార. రోడ్డుమీద దూరంగా యెవరో నవ్వుతున్నట్లు చప్పుడు వినవచ్చింది. మేడలో దీపాలుకూడా ఆమె అవస్థను చూసి, నవ్వుకుంటున్నట్లే తోచింది, తారకు. చెట్లు, చంద్రుడు, పిట్టలు—లోకం యావత్తూ తన్ను చూసి నవ్వుతున్నట్లనిపించిందామెకు. ఉదాసీనంతో ముఖం దించుకుంది. పోట్లాటమాని, బలహీనంగా ప్రాణంలేని బొమ్మవలె వొరిగింది, అతని చేతులలో. దిగులు, ఆశ్చర్యం, జనించాయి సింగుకు. పశ్చాత్తాపం కలిగి, కౌగలివదలి, బిక్కచచ్చి నిల్చున్నాడు. తలపైకెత్తి ఒక్కక్షణం తీక్షణంగా అతనివేపు చూసిందామె, యేమీ అనకుండా. చేతిరుమాలుతో పెదవులు, బుగ్గలు, తుడుచుకుంటూ, గిర్రున తిరిగి మేడవేపు వెళ్లిపోయింది.

ఇదివరలో తారాబాయి యెన్నడూ ఇట్టి అవమానం పొంది ఉండలేదు. తుదకు కంపెనీ మానేజగు సూర్యాభాన్‌కూడా ఆమె నీవిధంగా హింసించి యెరగడు. అతగాడంటే తారాబాయికి కొంచెం యిష్టం కూడా. తక్కినవాళ్లె న్ని వేళాకోళాలు చేసినా సూర్యభానునుమాత్రం గౌరవంతో చూసేది. అతని ప్రేమనెన్నడూ తిరస్కరించేదికాదు. సిగ్గుతో కౌగలించుకొని ముద్దులాడుకునేవా రిద్దరూ. కాని,...

సూర్యభాన్ చాలాచిన్నవాడు. తారాబాయి కంటె రెండుమూడేళ్లు పెద్దవాడేమో. మీసంకూడా బాగానల్ల పడలేదు. తండ్రి గతించినవెనక, సర్కస్ వ్యవహారాలన్నీ తనే చూసుకుంటున్నాడు. వొల్లమాలిన ధనం ఉంది అతనికి. అన్నివిధాలా స్వతంత్రుడే. తారాబాయిని పెళ్లాడి, సర్కస్‌గొడవ వదులుకొని, హాయిగా ఆమెతో సుఖించాలని అతని ముచ్చట. కాని ధైర్యంగా ఆమెతో తన మనోభీష్టం చెప్పడానికి సిగ్గు!

సూర్యాభాన్ అంటే యిష్టమే కాని, బాదల్చంద్‌ను చూస్తే, తారాబాయికి మతిపోయేది. అతన్ని తల్చుకున్నంతమాత్రాన, హృదయం ఆనందంతో సందడించేది. అర్థం కాని కోర్కెలతో మనసు కలవరపడేది. నిజమైన ప్రేమంటే, ఆమె కిదివఱలో అంతగా అనుభ

వానికి రాలేదు. కాని, యిప్పుడిప్పుడు చాలాసంగతులు బోధపడుతున్నాయి. ఏదో స్పష్టంగా తెలియని బాధతో మనసు అప్పుడప్పుడు కలతపడడం, ఏవో పిచ్చిపిచ్చి వాంఛలతో గుండె బరువెక్కడం, నిద్రలో తియ్యతియ్యని కలలు వచ్చి తృప్తి తీరకమునుపే మెలకువ రావడం, తిండి తిన్నగా హితవుకాకపోవడం, మొదలయిన అవలక్షణాలవలన తనలో జనించిన రుగ్మతను గుర్తించుకుందామె. బాదల్చంద్‌ను మనసారా వలచి, ప్రేమతత్వం అర్థంచేసుకుంది కొంతవరకు.

బాదల్చంద్ పహిల్వాన్; ఆసర్కస్‌కు ఆయువుపట్టువంటివాడు. రూపంలో మన్మథుడుకాకపోయినా, కంపెనీకి పేరు ప్రతిష్ఠలు సంపాదించినవాళ్లలో అతడు ముఖ్యుడు. నల్లగాఉన్నా, మెలితిరిగిన కండలతో అతని శరీరం మెరిసేది, బలంతో. పెద్దకళ్లు, తరుచైనమీసం—గంభీరంగా ఉండే దతనిముఖం. మనిషి చిన్నవాడే. పాతికేళ్లుంటాయి. మోటైన ఉక్కుగొలుసులు తెంచడం, ఛాతీమీద పెద్దపెద్దబరువైన రాళ్లు పెట్టించుకొని సుత్తులతో పగలగొట్టించడం, మొదలైన పనులుగాక, అడవిమృగాలతో వింతవింతవినోదాలు చేసేవాడు. పెద్ద ఇనపగజాల బోనులో పులులు, సింహాలు, ఆవులు, మేకలు, కోతులు—అన్నిటినీ ఒకచోట చేర్చి, వాటిచేత అద్భుతమైన పనులు చేయించేవాడు. ఒకే పళ్లెంలో అన్నిటికీ ఫలహారాలు పెట్టి తినిపించేవాడు. సింహంచేత తుపాకి పేలించేవాడు. పెద్దపులులను దుమికించేవాడు, మండుతూవున్న చక్రాలలోనుండి. సాధారణంగా ప్రతీ సర్కస్‌వాళ్లూ చూపించే చిల్లరవినోదాలు గాక, పెద్దపులులతోను, సింహాలతోను కొన్నికొన్ని భయంకరమైన 'ఫీట్లు' చేసిచూపించేవాడతడు. బోను గీను యేమీ లేకుండానే "రాజా" అనే పెద్దపులిని బయటికి తెచ్చి, గుర్రంమీదవలె దానిమీద స్వారీచేసేవాడు రంగస్థలంలో! ప్రేక్షకులు భయంతో ఊపిరి బిగపట్టుకొని చూసేవారా చిత్రాన్ని. మనిషితోవలె పులితో కుస్తీపట్టి, దానితో కిందామీదా పడి దొర్లేవాడు. అమాంతంగా దాన్ని భుజంమీద యెత్తుకొని మోసేవాడు. నిర్భయంగా పులినోట్లో తలదూర్చి తీసేవాడు. చూసేవాళ్లకు కంపం పుట్టించేది, ఆదృశ్యం!

ఎన్నోసార్లు తారాబాయి అతన్ని బ్రతిమాలుకుంది, ఆఫీటు మానవలసిందని. "పిరికిదానా!" అంటూ ఆమె నెగతాళిచేసి, నవ్వి, ఊరుకునేవాడు బాదల్చంద్.

తారాబాయి జమన్సింగ్‌తో కలహించి, ముఖం ముడుచుకొని మేడమీదికి వెళుతున్నప్పుడు, బాదల్‌చందామెకు యెదురుగా వస్తున్నాడు. మెరుపుదీపం వెలుగులో ఆమె ముఖవైఖరి కనిపెట్టి త్రుళ్లిపడ్డాడతడు. పలకరిస్తే బదులు చెప్పకుండా ఆమె తనగదిలోకి వెళ్లిపోయి, తలుపులు మూసుకుంది. కాని లోనుండి గడియ వేసుకునేలోపున, బాదల్చంద్ చప్పున లోపలికి వచ్చి ఆమె చెయ్యిపట్టుకున్నాడు.

అతడెన్నివిధాల ప్రార్థించి అడిగినా, ఆమె మొదట యేమీ చెప్పలేదు కాని, క్రమంగా ఉన్నదున్నట్లుగా జమన్సింగ్ ప్రవర్తనను తెలియజేసింది. శిరము ముద్దాడి, గుండెమీది కామెనువాల్చుకొని, ఓదార్చాడు బాదల్చంద్. సహజంగా సింగుమీద అతనికి పట్టరాని కోపం వచ్చింది.

మరికొంతసేపటికి కొరడా పట్టుకొని సింగుకోసం వెతుక్కుంటూ బయలుదేరాడు. సింగును చూసేసరికి వెర్రికోపంతో వొళ్లు మరచిపోయాడు, బాదల్‌చంద్. కొరడాతో అతడిని కుక్కను తన్నినట్లు చావగొట్టి కసి తీర్చుకున్నాడు.

"ఈమాటు దానివేపు కన్నెత్తి చూశావంటే, పీకనులిపి చంపేస్తాను నిన్ను. జాగ్రత్త!" అని పళ్లు కొరుకుతూ, తాటించాడు కూడా.

బాదల్చందు నెదిరించడం మదపుటేనుగుతో పోట్లాడడ మన్నమాట. ఆసంగతి తెలిసే ఊరుకున్నాడు జమన్సింగ్. కాని దెబ్బలు తిని పగ తీర్చుకోకుండా ఊరుకునే నైజం కాదతనిది. మనసులో రగిలేమంటను మనసులోనే అణచుకొని తరుణంకొఱకు నిరీక్షిస్తూమిన్నకున్నాడప్పటిమట్టుకు. పగ సాధించుకుందుకు మార్గా

లాలోచిస్తూ, రాత్రల్లా నిద్రపోక తనగదిలో యిటూ అటూ పచారు చేశాడు. గ్లాసుమీద గ్లాసు బ్రాందీ తాగాడు. తారాబాయిమీద అతనికి గల మోహమంతా ద్వేషంగా పరిణమించింది. బాదల్చంద్ మీద కసి తీర్చుకుందుకు సరియైన ఉపాయమేదీతోచక, మెదడు వేడెక్కి పిచ్చెత్తినట్లయిం దతనికి. తీవ్రంగా ఆలోచిస్తూ తలనొక్కుకున్నాడు చేతులతో. కళ్లుమంట. నరాలు పీకు. గుండెలోభారం. కొరడాదెబ్బలకు వొళ్లంతా నొప్పి. సారామత్తుకు కడుపులో యేదో వికారం. కోపం, మోహం, తాపం, అవమానం, అన్నీకలిసి అతని హృదయాన్ని నలిపి, పీడించి, దహించి పిప్పిచేశాయి.

ఆమర్నాడే సర్కస్ ప్రారంభ మవుతుందన్న సంగతి జ్ఞాపకం వచ్చింది సింగుకు. యేఊళ్లోనూ నాలుగాటలకన్న అధికం వెయ్యడం, ఆకంపెనీవాళ్లకు మామూలు లేదు. "ఈ ఊరునుండి కదిలేలోపునే వీడిపనిపట్టించి తీరాలి." అని మనోనిశ్చయం చేసుకున్నాడు సింగు.

మొదటి రాత్రితో సర్కస్‌వాళ్ల కీర్తి ఊరంతా వ్యాపించింది. వాళ్ల ప్రదర్శనం చూడతగినదని అందరికీ విశదమైంది. ఎవరినోటవిన్నా, తారాబాయిపేరు, బాదల్చంద్ పేరు, వినవచ్చేవి. ఈర్ష్యతోను, ద్వేషంతోను, వొళ్లు మండుకొచ్చింది జమన్సింగుకు. కాని వాళ్లనణిచే సాధనం కానరాలేదు. నిద్రాహారాలుకూడా తిన్నగా లేక, జమన్సింగు కెప్పుడూ ఒకటే ఆలోచన—బాదల్చంద్ మీద కసితీర్చుకోవడ మెట్లానా, అని.

జమన్సింగును తాను గట్టిగా శిక్షించినసంగతి బాదల్చంద్ నవ్వుతూ తారాబాయితో చెప్పినప్పుడు, సంతోషం వెలిబుచ్చడానికి బదులుగా నిట్టూర్పు విడిచిందామె.

"చా, మనిషంత మనిషిని అమాంతంగా మీద పడి కొట్టడం తప్పుకాదూ? ఇట్లా తొందర పడతావని తెలిస్తే, అసలు నీతో యేమీ చెప్పకనే పోదును."

"నిన్నట్లా అవమానపరచినందుకు వాడిని నిలువునా చీల్చెయ్యాలనిపించింది నాకు. ఇంకా పస్తాయించి ఊరుకున్నా నంతటితో! సంతోషించు—" అన్నాడు బాదల్చంద్.

"సింగు చాలా కార్పణ్యం గల మనిషి. నీ చేత దెబ్బలుతిని, ఊరుకుంటా డనుకోకు. పాముపగ, వాడిది!" అన్నదామె.

"ఏడిసాడు." అంటూ బాదల్చంద్ విరసంగా నవ్వి, "తారా, నువ్వు వట్టిపిరికిపిల్లవు సుమా!" అంటూ ప్రేమతో ఆమె నెత్తుకొని, వక్షాని కదుముకొంటూ, ముద్దులతో నోరు మూశాడు.

"బలం ఉన్నదని మోటసరసంకూడదు!...నొప్పి కాదూ, అట్లా నొక్కేస్తే?"

*　　*　　*　　*

రెండోనాటి ప్రదర్శనానికి సర్కస్‌డేరా తొమ్మిదిగంటలసరికే నిండిపోయింది. టిక్కెట్లు దొరకక, కొందరు ఆశాభంగులై యిళ్లకు మరలవలసి వచ్చింది.

తీగమీద తారాబాయి తన చాకచక్యాలన్నీ చూపి, ప్రేక్షకులను మెప్పించి, రెండు బంగారుపతకాలు సంపాదించింది. చప్పట్లతో డేరా ఊగిపోయింది. సభాసదులసన్మానంపొంది, ఆమె లోనికి వెళ్లిపోయినపిమ్మట, మానేజరు సూర్యాభాన్ ఆమెను సమీపించి, షేక్‌హాండ్ చేసి, తనసంతోషం వెల్లడిచేస్తూ, హెచ్చుగా పొగడి పొంగజేశాడు.

పిదప, ఆమెను తోడుకొని తన గుడారంలోకి తీసుకొనిపోయి, ఫలాహారాలు మేపి, ఒకగ్లాసు ఛాంపెనీ త్రాగించాడు; ఆనందంతో కులుకుతూ తారాబాయి తన క్రేగంటిచూపులతోను, ముసిముసి నవ్వులతోను కృతజ్ఞతను సూచించింది, అతని దయకు. ఆమె మోహనరూపానికి పరవశుడై అట్టే ఆమెముఖంవేపు చూస్తూ, మీద చెయ్యివేసికూచున్నాడు సూర్యాభాన్.

"తారా, ఈవాళ నీప్రదర్శనం, నీచక్కదనం అద్భుతంగా ఉన్నాయి!"

ఇద్దరూ లేబ్రాయమువారు. రూపవంతులు. ప్రియులు. సర్కస్‌గొడవ మరచిపోయి ప్రియాలాపాలలో పడ్డారు. నవ్వులు, ముద్దులు, కౌగిలింతలు, నిట్టూర్పులు— ఒకరి కౌగిట్లో ఒకరి వొళ్లు మరచి కళ్లుమూసుకున్నారు.

బాదల్చంద్ ఆడేరాకు సమీపంగా యెక్కడికో వెళుతూ, అప్రయత్నంగా లోనికి తొంగి చూశాడు. మానేజరు కంఠాన్ని కౌగలించుకొని, ప్రేమతో అతనికి ముద్దులిస్తూవుంది తార!

కోపంతోను, 'జెలసీ'తోను హృదయం మండి పోయింది, బాదల్చందుకు. తన నెంతో ప్రేమిస్తూ ఉన్నట్లు చెప్పిన తార యీవిధంగా ద్రోహం చేస్తుందని అత డెన్నడూ అనుకోలేదు—కలలోనైనా. అతనికేమీ అర్థం కాలే దామె ప్రవర్తన.

"వా డావిధంగా మీద చెయ్యి వేస్తే యెట్లా సహించుకుంటూవుంది తార? ఒళ్లు కాలినట్లనిపించదూ? లేక......"

అధికం ఊహించుకుందుకు కూడా యిష్టపడ లేదు, అతని మనస్సు!

జమన్సింగును కొట్టినట్లేకాదు! సూర్యాభాను నెట్లా యెదిరించడం? కొండతో ఢీకొని పోట్లాడితే గొఱ్ఱెపోతుకే ముప్పు,—తల పగిలి చస్తుంది. ఏంచెయ్యడానికీ పాలుపోలేదు, బాదల్చంద్‌కు. దుర్భరమైన యీర్ష్యతో బాధపడ్డాడు. తారాబాయి ననక, సూర్యాభాను ననవలసిన పనియేముంది? కాని ఆమెమీద బాదల్చందుకు గల అధికారమేమిటి? అన్నిటికీ స్వతంత్రురాలామె. కాని,............

తల గిర్రున తిరుగుతూ వుంది—నిద్రలో నడిచే వాడివలె తూలిపోతూ అక్కడినుండి వెళ్లిపోయాడు బాదల్చంద్.

నాడు సర్కస్‌లో తాను చేయవలసినపనులలో యేమీ ఉత్సాహంలేకుండె నతనికి. ఏదో విధిలేక, మొక్కుతీర్చుకున్నట్లు నెరవేర్చాడు, కొన్ని ఫీట్లను. అడవిజంతువులచేత వినోదాలు చేయించినప్పుడు, అతని కత్యంత ప్రియమైన 'రాజా' అన్న పులి అల్లరిప్రారంభించింది. చెప్పినమాట వినకుండా బద్ధకించి మూలిగేది. యజమానిని సమీపించడానికి ఉత్సాహం వెలిబుచ్చడానికి బదులు, గుర్రుపెట్టి దూరదూరంగా జరిగేది. వెర్రికోపం వచ్చింది బాదల్చందుకు. లోకమంతా అతన్ని హఠాత్తుగా ద్వేషించి, హింసించి, పరాభవించడాని కుద్యమించినట్లు తోచిందతనికి! మనసిచ్చి ప్రేమించిన తారాబాయి తుదకు మోసంచేసి, అతని ప్రేమను అవమానపరచింది. ఇప్పుడీపులికూడా అతని స్నేహాన్ని అగౌరవిస్తూవుంది. ఇన్నివేలమంది చూస్తూవుండగా, అతనిఖ్యాతికి భంగం తేస్తూ, అసందర్భంగా ప్రవర్తిస్తూ వుంది 'రాజా'. అవమానం సహించుకోలేకపోయాడతడు. తాగినవాడివలె వొళ్లుమరచిపోయి, కొరడా తీసుకొని, పులిని కొట్టడం ప్రారంభించాడు. ప్రేక్షకులకు భీతి పుట్టింది. గాండ్రు గాండ్రు మని పులి అరుస్తూఉన్నప్పుడల్లా భూమి వణుకుతున్నట్లనిపించేది. కొరడాచప్పుడుతో డేరా మారుమ్రోగింది. ఎన్ని దెబ్బలు తిన్నా, పులి తన మూర్ఖతను వదలలేదు. కోరలుచూపి, కస్సుమని యెదురు తిరిగింది.

'రాజా' సామాన్యమైన పులికాదు. తెలివితేటలు, చురుకుదనం, హృదయం, గల అపూర్వమైన జంతువు. బాదల్చందు నెంతో ప్రేమిస్తూ, మిక్కిలి అడకువతోను, మర్యాదతోను మెసలేది, అతనివద్ద. నాడు మామూలుకు వ్యతిరేకంగా ప్రవర్తించడానికి, తగినహేతువేదో ఉండవచ్చునని గ్రహించలేకపోయాడు, బాదల్చంద్. సాధారణంగా సర్కస్‌వాళ్లు పులులకు, సింహాలకు అప్పుడప్పుడు నల్లమందు తినిపిస్తూ ఉంటారు. మత్తుచేత వాటి ఘాతుకస్వభావం కొంతసేపైనా అణగిఉంటుందని అభిప్రాయం కాబోలు! 'రాజా' శరీరతత్వం యెట్టిదోకాని, నల్లమందువాసనే పడేదికాదు దానికి. బలవంతం మీద యెప్పుడైన తినవలసివస్తే, ఆ రోజల్లా పిచ్చెత్తినట్లు ప్రవర్తించేది. జమన్సింగుకు దానిప్రకృతి తెలుసు. కాబట్టి నల్లమందుమాత్రం యెన్నడూ దానికి పెట్టనిచ్చేవాడు కాడు. కాని, ఆరోజున ఉద్దేశపూర్వకంగా మాంసంలో నల్లమందు తనే స్వయంగా కలిపి 'రాజా'కు పెట్టించాడు. కడుపులో వికారం పుట్టి, వమనం చేసుకుందుకు యత్నించింది పులి. జమన్సింగ్ నీళ్లలో యేదో మందుకలిపి మళ్లీ తాగించాడుపులిచేత,

'రాజా'కు ఒంట్లో సరీగా లేదన్న సంగతి మానేజరుకు కూడా చెప్పలేదాయన.

రంగస్థలంలోకి వచ్చి మనుషులను, దీపాలను చూసేసరికి, 'రాజా'కు గిర్రున తలతిరుగుతూ ఉండెను. మత్తుగా, బద్ధకంగా, ఉండెను, ఒంట్లో. 'ఈవాళ నాకు సరీగాలేదు. నన్ను బాధపెట్టకు.' అని దీనంగా వేడుకొని గుర్రుతో తెలియజేసింది, యజమానికి. కాని బాదల్చంద్ దాని ప్రార్థన నర్థం చేసుకునే స్థితిలో లేకుండెను.

ఎన్నడూ శిక్ష యెరగని జంతువుకు వీపుమీద దెబ్బలు పడగానే, కష్టం తోచింది. పౌరుషం కలిగి 'రాజా' యెదురు తిరిగింది. అమాంతంగా మనిషిని చీల్చేస్తుందా అన్నంత ఆగ్రహం చూపింది, కళ్లలోను కోరలలోను. ప్రేక్షకులు భయపడి గొల్లుమన్నారు. మానేజరు ముందుకువచ్చి, ఫరవాలేదని వాళ్లకు ధైర్యం చెప్పి అల్లరి, కేకలు కూడదని మందలించాడు.

బాదల్చంద్ను, పులిని, భయదృష్టులతో చూస్తూ దగ్గిరగానే నిల్చుంది తారాబాయి. అతని కపాయం రాకుండా కాపాడమని దేవుణ్ణి వెయ్యివిధాల మొక్కుకుంది మనసులో. ఏదైనా ప్రమాదం సంభవిస్తే, వెంటనే పులిని చంపడానికి ప్రక్కనే ఇద్దరు భటులు నిల్చున్నారు, తుపాకులు పట్టుకొని.

రౌద్రాకారంతో పంజాతెరచి, వ్యాఘ్రం తన్నెదిరించడానికి వచ్చినప్పుడు బాదల్చంద్కు గుండెలో దడ పుట్టింది. అప్రయత్నంగా చేతిలోవున్న కొరడా క్రిందికి జారిపోయింది. "రాజా!" అని బిగ్గరగా అరచి, నిస్సహాయుడై నిల్చున్నాడు—చావుకు సిద్ధపడి.

అతని కేకతో మెలకువ వచ్చింది పులికి. రౌద్రం అణిగి పశ్చాత్తాపంతో నిల్చుంది, అతని పాదాలు మూ చూస్తూ! ధైర్యంగా మెడమీద తట్టి వీపునిమిరి 'రాజా'ను బుజ్జగించాడప్పుడు బాదల్చంద్. అతని కరస్పర్శవలన మంత్రింపబడినట్లు పిల్లివలె లొంగిపోయింది, పులి. అద్భుతమైన ఫీట్లు చేయించాడప్పుడు దానిచేత. ఊపిరి బిగపట్టుకొని చూస్తూ, ప్రాణాలులేని ప్రతిమల వలె కూచున్నారు ప్రేక్షకులు. కిక్కురుమన్న ధ్వని కూడాలేక, డేరాఅంతా నిశ్శబ్దం!

పన్నెండు గంటలు కావచ్చింది. ఇంకో ఐదు నిమిషాలలో ఆట ముగుస్తుంది. 'రాజా' చేత ఆఖరు ఫీటు చేయించడాని కుద్యమించాడు బాదల్చంద్. కాని పులి తన అయిష్టతను సూచించింది.

అలసి, రుమాలుతో ముఖం తుడుచుకున్నాడు బాదల్చంద్. ఆక్షణంలో యెదురుగానిల్చున్న తారాబాయిని చూశాడు. ఆమెదృష్టి అంతా తనమీదనే ఉన్నట్లు విశదమైందతనికి. ఆభ్రమర నేత్రాలనుండి వెలువడిన ప్రేమకిరణాలతనిహృదయాన్ని దూసుకొపోయి, మనసును కలవరపెట్టినవి. దీర్ఘమైన నిట్టూర్పువిడచి, ఆమెనుండి దృష్టి మరల్చుకున్నాడు.

పులిని కొంతసేపు బుజ్జగించి, నోరు తెరవమని ప్రోత్సహించాడు. దవడలు బిగపట్టి మూర్ఖంగా నిల్చుంది 'రాజా'. తలపైకెత్తి జిగజిగలాడే పచ్చని మెరుపుకళ్లతో అట్టే చూసిందతనివేపు, దీనంగా!... "వొద్దు. నన్ను బలవంతపెట్టకు. నాతల తిరుగుతూవుంది. తెలివితప్పి, యేమక్రమంచేస్తానో అని దిగులుగావుంది. నన్ను క్షమించి, నేటికి విడిచిపెట్టు." అన్నభావం వెలిబుచ్చింది, ఆచూపులో! బాదల్చంద్ మన్నించలేదు దాని ప్రార్థనను. దవడమీద చరిచి, నోరు తెరవమని ఆజ్ఞాపించాడు.

విద్యుద్దీపాల కాంతిలో తళతళ మెరిశాయి కోరలు మృత్యుద్వారంవలె తెరువబడిన పులినోట్లో చప్పున తలదూర్చాడు బాదల్చంద్. పెట్టెకప్పు మూతపడినట్లు దవడలు మూసుకొపోయాయి 'రాజా' కి. వెచ్చని రక్తంతో నోరు తడిసింది దానికి. అదరిపడి కళ్లువిప్పి, నోరు తెరచింది. కంఠం కత్తిరించుకొపోయింది, బాదల్చంద్కు. స్మృతిలేక క్రిందపడ్డాడు. జరిగిన ప్రమాదమప్పుడు విశదమైంది పులికి. దుఃఖంతో అతని ముఖం చూస్తూ, కన్నీరు విడచింది, రాజా! రెండుసారులు తుపాకిమ్రోత మారుమ్రోగింది, డేరాలో. ఒక్కసారి

మూలిగి, గుండెనుండి వరదలుగా రక్తం కార్చుకుంటూ, వెంటనే నేల కొరిగింది పులి. గొల్లుమన్నారందరూ!

బాదల్ చందును రంగస్థలంనుండి లోనికి తీసుకొపోయినారు. పెద్దపెద్ద డాక్టర్లు వచ్చి తమ శక్తిసామర్థ్యాలన్నీ వినియోగించారు కాని, లాభం లేకపోయింది.

నెత్తీ నోరూ కొట్టుకొని, అతని మృతకళేబరం మీదపడి యేడ్చింది తారాబాయి. సర్కస్ మెంబర్లందరూ కంట తడిపెట్టుకున్నారు. మానేజరు సూర్యాభాన్ తారాబాయిని మెల్లగా లేవనెత్తి, పడిపోకుండా ఆమెను తన వక్షంమీదికి వాల్చుకొని, శిరం నిమురుతూ, జేబురుమాలుతో కన్నీళ్లొత్తి ఓదార్చాడు.

గ్రీష్మము

పెమ్మరాజు లక్ష్మీపతిగారు

పవడంపు జివురుజొంపంబులు పరచిన పెండ్లిపందిళ్లు విప్పించినావు,
గానంపుకోకిలసానిమేళము జిగురాకుబత్తెము లిచ్చి యనిపినావు,
అలరుదేనియవిందు లారగింపగజేసి యలిబంధువుల సాగనంపినావు,
పువ్వుపళ్లెరముల బుప్పొడిపసుపుల పేరంటములు పంచిపెట్టినావు,
అన్నిమరియాదలును నయమారనడపి-నావు, సత్సంప్రదాయంపు నడకలెరిగి;
నాకబలిమైన యామరునాడువోలె-చిన్నవోయియు నీయిల్లు చెన్నుమీరె.
నిన్నమొన్ననె గద పెండ్లి వన్నెచిన్నె-లెల్ల వెలయించితివి భువి నెల్లయెడల
కాని, ప్రకృతిరో! యిమ్మహోగ్రాతపమున-తీక్ష్ణతమమైన యీతపోదీక్ష యేల?
వసుధ బీరెండ బీటలు వారిపోయె-జలము లావిరియై యాకసమున దేలె,
అనిల మొక్కట స్తంభించి యట్టె నిలిచె-అనల మేపారి తన సరిహద్దు దాటె.
నీడలకునైన నిలువగ నీడలేక-యవనియంతయు దేజోమయత్వమంద
తనప్రతాపంబు కేంద్రీకృతంబుజేసి - వెలుగుచున్నాడు రవి వినువీథినొకడె.
పూచిన పూలు లోని వలపుల్ వెలిసేయ వినూత్నయౌవన
శ్రీ చిగురొత్తగా ప్రణయచిహ్నితమైన వపుస్త్రిశాస మ